ఈనాడు
మహబూబ్‌నగర్

కష్టపడి చదివి.. ఉపకులపతి స్థాయికి ఎదిగి

పీయూ వీసీగా డా.జీఎన్ శ్రీనివాస్ ● నేడు బాధ్యతల స్వీకరణ



పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా రానున్న జీఎన్ శ్రీనివాస్ సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. అంచెలంచెలుగా ఎదిగారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివారు. బీటెక్ పూర్తయిన తర్వాత ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైంగా ఉద్యోగం చేస్తూ మరోవైపు సాయంత్రం కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం అంచెలంచలుగా ఎదిగి ఉపకులపతి స్థాయికి చేరారు.

159 మందిలో..: పీయూకి మే 21 నుంచి రెగ్యులర్ ఉప కులపతి లేరు. ఈ పోస్టు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల నుంచి అర్హత కలిగిన 159 మంది దరఖాస్తు చేసుకోగా చివరికి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పోస్టుకు డిమాండ్ పెరిగింది. కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిన తర్వాత ఇక్కడ ఉపకులపతి పోస్టుపై అనేక మంది ఆసక్తి చూపారు. అందులో ప్రభుత్వం అనుభవం కలిగిన ఆచార్యుడికి బాధ్యతలను అప్పగించింది.

కుటుంబ నేపథ్యం: శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా గంభీరావ్‌పేట మండలం కొత్తపల్లి. తల్లిదండ్రులు నర్సయ్య, ఎల్లవ్వ వ్యవసాయం చేసేవారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు గంభీరావ్‌పేట ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1991లో ఎంసెట్ ద్వారా మంచి ర్యాంకు సాధించి జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ విద్యలో ఈఈఈ విభాగంలో చేరారు. 1995లో బీటెక్ పూర్తయిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైం కింద అధ్యాపకులుగా చేరారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సాయంత్రం కళాశాల ద్వారా ఎంటెక్ పూర్తి చేశారు. 1997 వరకు సహాయాచార్యులుగా పని చేశారు. 2003లో అనంతపురం జేఎన్‌టీయూలో రెగ్యులర్ పోస్టు కింద అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2006లో జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అక్కడే పని చేస్తూ 2011లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. 2022లో సీనియర్ ఆచార్యులుగా అర్హత లభించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ పని చేస్తున్నారు. వైస్ ప్రిన్సిపల్‌గా, ప్రిన్సిపల్‌గా, పలు కళాశాలలకు మెంటార్‌గా, పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా, పలు పోటీ పరీక్షలకు సభ్యుడిగా, వసతి గృహ మేనేజర్‌గా సేవలు అందించారు.

కొత్త వీసీకి సవాళ్లెన్నో..: పీయూలో పలు సవాళ్లు కొత్త ఉపకులపతికి ఎదురు కానున్నాయి. విశ్వవిద్యాలయం సిబ్బందిపై పూర్తి అజమాయిషీ కరవైంది. కొందరు విధులకు వచ్చినట్లు హాజరు వేయించుకుని బయటకు వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తరగతులపై పర్యవేక్షణ, అధ్యాపకుల అజామాయిషీని పకడ్బందీగా చేయాల్సి ఉంటుంది. లా కళాశాలకు గతేడాది అనుమతి వచ్చినా ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదు. బాలికల వసతిగృహంలో ప్రస్తుతం ఒక గదిలో 8 మంది ఉంటున్నారు. ఒక గదిలో నలుగురు మాత్రమే ఉండాలి. మరో భవనం నిర్మించినా ఇంతవరకు ప్రారంభించలేదు. పర్యావరణ విద్యకు తరగతి గదుల్లేవు. కొల్లాపూర్, గద్వాల, వనపర్తి పీజీ కేంద్రాల్లో వసతి గృహాల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

● పీయూకి ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నేడు వీసీగా బాధ్యతలు స్వీకరిస్తాను. 29 ఏళ్లుగా బోధనా రంగంలో పని చేస్తున్నాను. అన్ని విభాగాల్లో బాగా పని చేసిన అనుభవం ఉంది. అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన ఉంది. వర్సిటీ అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తాను.

-జీఎన్ శ్రీనివాస్, పీయూ ఉపకులపతి

ఆసుపత్రిని సందర్శించిన విచారణ బృందం

జడ్చర్ల : జడ్చర్ల ప్రాంతీయ ఆస్పత్రిని శుక్రవారం విచారణ అధికారుల బృందాలు సందర్శించాయి. నాగసాలకు చెందిన కీర్తి ఈనెల 16న కాన్పు కోసం ఆస్పత్రి రాగా వైద్యులు అందుబాటులో లేకపోవడం, స్టాఫ్‌నర్సు కాన్పు చేయడంతో నవజాత శిశువు మృతి చెందింది. వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇద్దరు గైనకాలజిస్టుల బృందం కాన్పు సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్సు, సూపరింటెండెంట్ చంద్రకళ నుంచి శుక్రవారం వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. మరో బృందం వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ శివప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.శ్రీధర్‌రెడ్డి ఆస్పత్రిలో మందుల పరిస్థితిని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

రూ.1.20 కోట్ల జరిమానా ఏమైనట్లు?

చౌడమ్మకుచ్చ మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోని నాటి ఏడీ

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు బాలనగర్‌లోని ఓ రియల్ వెంచర్‌లో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చారని, ప్రభుత్వానికి రూ.కోట్లల్లో నష్టం వాటిల్లిందని పేర్కొంటూ రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్.. ప్రస్తుతం జనగామ జిల్లా ఏడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయటం కలకలం రేపింది. ఆరాతీస్తే ఆయన మహబూబ్‌నగర్ పట్టణం ఎదిర సమీపంలోని చౌడమ్మకుచ్చను అక్రమంగా తవ్వి భారీ మొత్తంలో మట్టి తరలించిన మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారిపైనా చర్యలు తీసుకోలేదని, వారి నుంచి జరిమానా వసూలు చేయకుండా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొట్టారని తెలిసింది. విచారిస్తే ఇలాంటివి చాలా వెలుగుచూసే అవకాశముంది.

60,375 టన్నుల మట్టి రవాణా : సరిగ్గా రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం చుట్టూ మట్టి మాఫియా రెచ్చిపోయింది. కంటికి కనిపించిన గుట్టలన్నీ కరిగించేసింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడ పడితే అక్కడ గుట్టలను తవ్వి మట్టిని టిప్పర్లలో వెంచర్లకు, భవనాల పునాదులకు తరలించి రూ.కోట్లల్లో సొమ్ము చేసుకున్నారు. 2022 సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఎదిర శివారులో చౌడమ్మకుచ్చను మట్టి మాఫియా చెరబట్టింది. రెండు మాసాల పాటు రాత్రింబవళ్లు చౌడమ్మకుచ్చ నుంచి మట్టిని టిప్పర్లలో తిరుమల హిల్స్‌లో అప్పటి కీలక నేతకు బినామిగా చెలామణి అవుతున్న ఓ స్థిరాస్తి వ్యాపారి వెంచర్‌కు తరలించారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన ఎదిరవాసులు 'న్యూస్‌టుడే'కు సమాచారం ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి 'రెచ్చిపోతున్న మట్టి మాఫియా' శీర్షికన 2022 అక్టోబర్ 9న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పటి మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ స్పందించారు. మరుసటి రోజైన 10వ తేదీన తమ సిబ్బందితో వెళ్లి చౌడమ్మకుచ్చతో పాటు మట్టిని తరలించి పోసిన తిరుమల హిల్స్‌లోని వెంచర్‌ను కూడా పరిశీలించారు. నేలమట్టమైన చౌడమ్మకుచ్చను ఆశ్చర్యం వ్యక్తంచేసిన ఆయన ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు. చౌడమ్మకుచ్చ నుంచి తరలించిన మట్టికి పూర్తిస్థాయిలో అంచనాలు వేశారు. టిప్పర్లతో వెంచర్‌లో పోసిన మట్టి ఎత్తు 2.50 మీటర్లు, పొడవు 350 మీటర్లు, వెడల్పు 46 మీటర్లు ఉన్నట్లు కొలతలు వేసి గుర్తించి రికార్డు చేశారు. ఈ మట్టి దాదాపు 60,375 టన్నులు ఉంటుందని తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూ.20 చొప్పున 10 రెట్ల జరిమానా విధిస్తామని, ప్రభుత్వానికి రూ.1,20,75,000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మొత్తం జరిమానాను మట్టి తరలింపునకు కారణమైన వ్యక్తులు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదు చేసి వసూలు చేస్తామన్నారు. నెల రోజులు దాటినా ఏడీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చర్యలు తీసుకోకపోవడంపై మరోమారు 'న్యూస్‌టుడే' ఏడీ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదంటూ మైనింగ్ శాఖ నియమావళిని వివరించే ప్రయత్నం చేశారు.



చౌడమ్మకుచ్చ మట్టి పోసి చదును చేసిన వెంచర్ ఇదే

కార్యాలయంలో కనిపించని దస్త్రాలు : చౌడమ్మకుచ్చ ద్వారా అక్రమంగా మట్టిని తరలించిన వ్యవహారంపై ప్రస్తుతం మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అలాంటి దస్త్రాలు, జరిమానా వసూలు చేసిన దాఖలాలు లేవని స్పష్టంచేశారు. చౌడమ్మకుచ్చ మట్టిని తరలించే పనిని జడ్చర్ల, అప్పన్నపల్లికి చెందిన కొందరు టిప్పర్ల యజమానులకు స్థిరాస్తి వ్యాపారి అప్పగించారు. ఒక్కో లోడుకు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధర నిర్ణయించడంతో టిప్పర్ల యజమానులు రాత్రింబవళ్లు చౌడమ్మకుచ్చ నుంచి తిరుమల హిల్స్‌లో వెంచర్‌కు మట్టిని తరలించారు. ఈ వ్యవహారంలో నేతల ఆశీర్వాదంతో కేసులే కాదు.. జరిమానా కూడా చెల్లించకుండా టిప్పర్ల యజమానులు తప్పించుకోవటం గమనార్హం.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై నీలి శ్రీనివాసులు, సంపత్‌కుమార్, సరిత తదితరులు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణలో నిరంకుశత్వం, నియంతృత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గద్వాలలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణతో పాటు కృష్ణవేణి చౌక్‌లో ఏర్పాటుచేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.2లక్షలపైన ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉందని అది కూడా చేస్తామన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష మాఫీ చేయని వాళ్లకు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. త్వరలోనే నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రకటిస్తామని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లా వారే కావడంతో ఇక్కడి రైతులను దృష్టిలో ఉంచుకుని జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తారన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరితలు మాట్లాడుతూ ఒక బీసీ బిడ్డ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, పుర ఛైర్మన్ బీఎస్ కేశవ్, టీపీసీసీ సభ్యుడు శంకర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి, నాయకులు ఇసాక్, షెక్షావలి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజరు..: ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గైర్హాజరవటం చర్చనీయాంశంగా మారింది. కాగా ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు హాజరు కావాల్సి ఉండగా వారు రాకపోవడంపైనా చర్చించుకోవడం కన్పించింది.

మెప్మా సీవో యాదయ్యపై వేటు

కోయనగర్ సమాఖ్య వ్యవహారంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశం

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్య వ్యవహారంలో మెప్మా సీవో(కమ్యూనిటీ ఆర్గనైజర్) జి.యాదయ్యపై వేటు పడింది. ఆ విధుల నుంచి ఆయన్ని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల దస్త్రం మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డికి చేరింది. మహిళల పొదుపు సొమ్ము, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల నగదును సొంతానికి వాడుకున్న ఆర్పీ శ్రీలతపై ఠాణాలో కేసు నమోదు చేయడంతో పాటు డబ్బు రికవరీ చేయాలని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో డబ్బు దుర్వినియోగంపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనాలతో స్పందించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి మెప్మా సీవోలతో సమీక్ష నిర్వహించారు. ఆర్పీ శ్రీలత రూ.కోట్లలో మహిళల సొమ్ము పక్కదారి పట్టిస్తే సీవోలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోయనగర్ వ్యవహారంలో సంఘాల సభ్యులు నష్టపోరాదని, అక్రమాలకు పాల్పడ్డ ఆర్పీపై క్రిమినల్ చర్యలు తప్పవని, మిగతా ఆర్పీలపై సీవోలు దృష్టి సారించాలని సూచించారు. ఈ వ్యవహారంపై తుది నివేదిక రాగా కలెక్టర్, అదనపు కలెక్టర్.. మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. కోయనగర్ సమాఖ్యలో మూడేళ్లుగా జరుగుతున్న అవకతవకలు గుర్తించడంలో సీవో యాదయ్య పూర్తి నిర్లక్ష్యంతో బాధ్యతారాహిత్యంగా పనిచేశారని గుర్తించిన కలెక్టర్ అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఆర్పీ నుంచి డబ్బు ఇప్పించాలని ఎమ్మెల్యేకు మొర

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: ఆర్పీ శ్రీలత నుంచి మా డబ్బులు రికవరీ చేసి ఇప్పించాలని కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యకు చెందిన మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. మౌలాలిగుట్ట వద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలనకు ఎమ్మెల్యే వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎమ్మెల్యే దొడ్డలోనిపల్లి చేరుకోగానే మహిళలు ఆయన వద్దకు చేరుకొని తాము మోసపోయిన వైనాన్ని వివరించారు. ఆర్పీపై చర్యలు తీసుకొని డబ్బు వసూలు చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సూచనలతో సమాఖ్య మహిళలు గ్రామీణ ఠాణాలో శ్రీలతపై ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు దస్త్రం అందజేశారు.

పోటీల్లో పాలమూరు వాసి ప్రతిభ

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి పోలీసు శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న డ్యూటీ మీట్‌లో పాలమూరు వాసి సత్తా చాటాడు. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ 2018లో హైదరాబాద్ సిటీ పోలీసులో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం సిటీ పోలీస్ శిక్షణ విభాగంలో పని చేస్తున్నాడు. రెండు రోజుల నుంచి రాష్ట్ర స్థాయిలో పోలీసులకు నిర్వహిస్తున్న పోటీల్లో ప్రొఫెషనల్ ఫొటో గ్రాఫర్ విభాగంలో రాష్ట్రంలోను ప్రథమ స్థానంలో నిలిచాడు. హత్య జరిగిన ప్రాంతంలో ఒకే ఫొటోలో అన్ని రకాల ఆధారాలు కనిపించేలా అద్భుతంగా తీసినందుకు ఆయన ఫొటోకు ప్రథమ బహుమతి వచ్చింది. దీంతో శుక్రవారం అతనికి సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు.



సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న రాజశేఖర్

రోగులకు మెరుగైన సేవలందించండి: కలెక్టర్



ఆసుపత్రిలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, చిత్రంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ, తదితర వాటిని పరిశీలించారు. అనంతరం తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ యంత్రాలు పని చేయకపోవడంపై ఆరా తీశారు. పనిచేస్తున్న వారి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎన్ని రక్త నమూనాలు వస్తున్నాయని, వాటి ఫలితాలను ఏ విధంగా పంపిస్తున్నారని, యంత్రాలు పని చేయకపోతే తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5 భోజనం వద్దకు వచ్చి అక్కడ రెండు, మూడు రోజుల నుంచి చెత్త చెదారాన్ని తొలగించకుండా ఉన్న విషయాన్ని గమనించారు. ఆసుపత్రిలో ఐసీయూ సమీపంలో ఉన్న చెత్తను చూసి కలెక్టర్ అక్కడే ఉన్న సీహెచ్‌వో రామునాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మాతా శిశు విభాగంలోని మెట్లపై అపరిశుభ్రంగా ఉండటంతో కలెక్టర్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల తరువాత మరల వస్తానని, అప్పటికి ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎంహెచ్‌వో డా.పద్మ, సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, జిల్లా మలేరియా అధికారి డా.శశికాంత్, ఆర్ఎంవో జరీనా భాను, శ్వేత, దుర్గా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 11 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా మొత్తం కలిపి 83 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలోకి 45వేల క్యూసెక్కుల చేరుతుండగా దిగువకు 44వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 51 వేలు చేరుతుండగా దిగువకు 45 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. మరో రెండు రోజుల పాటు జూరాలకు వరద నిలకడగా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పంట కోసం.. నానా పాట్లు

జడ్చర్ల, న్యూస్‌టుడే: కర్షకులు ఆరుగాలం శ్రమిస్తూ పంటలు కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. పొలాల్లో మోటార్లు ఉన్న రైతులు కొన్ని సందర్భాల్లో విద్యుత్తు ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు ఫణంగా పెడుతున్నారు. విద్యుత్తు శాఖ గుత్తేదార్లు, సిబ్బంది చేయాల్సిన పనులు రైతులే చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గత నెలలో జడ్చర్ల మండలం చిన్నఆదిరాలకు చెందిన ఇద్దరు రైతులు ట్రాక్టర్‌లో స్తంభాలు తరలిస్తూ వాహనం బోల్తా పడి ప్రాణాలు పోగొట్టుకోవడమే దీనికి నిదర్శనం. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. వేరుసెనగ, వరి పంటలకు నీరు అవసరం, లేదంటే చేతికొచ్చిన పంట చేజారిపోతుంది.

భారం పెరగడంతో.. : సాధారణంగా వ్యవసాయ బోరు మోటార్లు 5 ఆమ్స్ ఓల్టేజితో పని చేస్తాయి. భూగర్భ జలాలు పెరగడంతో మోటారు ఎక్కువ నీటిని తోడుతుంది. మోటారు సాధారణం కంటే 7-8ఆమ్స్ ఓల్టేజి తీసుకుంటుంది. దీని ప్రభావంతో పొలాల్లో ఉన్న నియంత్రికపై భారం పడటంతో నియంత్రిక కాలిపోతోంది. సాధారణంగా నెలలో 30-35 విద్యుత్తు నియంత్రికలు జడ్చర్ల సబ్ డివిజన్‌లో కాలిపోతుండంతో మరమ్మతులు చేసేవారు. గత నెల 150 నియంత్రికలు కాలిపోవడం గమనార్హం. జడ్చర్ల సబ్‌డివిజన్ పరిధిలో జడ్చర్ల, మిడ్జిల్, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాలున్నాయి. ఇక్కడ మొత్తం 25 విద్యుత్తు ఉపకేంద్రాలు ఉన్నాయి. విద్యుత్తు నియంత్రికలు కాలిపోతే ఈ మండలాలతో పాటు రాజాపూర్, బాలానగర్ మండలాల నియంత్రికలు కూడా జడ్చర్లలో ఎస్‌పీఎం కేంద్రంలో మరమ్మతులు చేస్తారు. ఈ కేంద్రంలో నియంత్రికలు అందుబాటులో లేకపోవడంతో నియంత్రికల మరమ్మతుల్లో జాప్యం జరుగుతోంది.

● విద్యుత్తు శాఖలో నియంత్రిక కాలిపోతే మరమ్మతులు చేసి మళ్లీ బిగించడం ఆ ప్రాంత లైన్‌మెన్ పని. ఈ విషయంలో రైతులు చెప్పినా లైన్‌మెన్‌లు సకాలంలో స్పందించడం లేదు. వేచి చూడలేక చాలాచోట్ల స్థానికుల సాయంతో రైతులే ఆ పని చేస్తున్నారు. ఎస్‌పీఎం కేంద్రంలో వాహనం ఉన్నా, ఎక్కువ నియంత్రికలు కాలిపోవడంతో రవాణా చేయడానికి సాధ్యం కావడం లేదు. రైతులే సొంతంగా తీసుకొస్తున్నారు. రైతులు వాహనాలు తెచ్చుకుంటే పట్టణంలో రూ.750, గ్రామాలకు వెళ్తే రూ.వెయ్యి విద్యుత్తు శాఖ చెల్లిస్తుంది. ఈ నగదును రైతులకు చెల్లించకుండా గుత్తేదార్లే బిల్లులు తీసుకుంటున్నారు.



జడ్చర్ల నియంత్రికల మరమ్మతుల కేంద్రం వద్ద రైతులు పడిగాపులు

● నీటిమట్టం పెరగడంతో సాంకేతిక సమస్యలు ఏర్పడి విద్యుత్తు నియంత్రికలు కాలిపోతున్నాయి. నిత్యం 5-7 నియంత్రికలు మరమ్మతులు చేసి ఇస్తున్నారు. రైతులు వద్దన్నా స్వయంగా తీసుకు వస్తున్నారు. మా దగ్గర గుత్తేదారు ఎప్పటికప్పుడు సామర్థ్యానికి మించి నియంత్రికలు అందజేస్తున్నారు.

-హర్షవర్ధన్‌రెడ్డి, నియంత్రికల మరమ్మతు కేంద్రం ఏఈ, జడ్చర్ల.

ఎరువు.. ఇక కాదు బరువు

మరో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్

గద్వాల, న్యూస్‌టుడే: రైతులకు ఎరువులను మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఎరువుల సరఫరా కోసం ప్రస్తుతం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ మాత్రమే వ్యవహరిస్తోంది. అన్ని ప్రాంతాలకు ఎరువుల సరఫరా సవ్యంగా జరగాలంటే మరో సంస్థకు కూడా బాధ్యతలు ఉండాలని ఆలోచించి వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్)ను మరో నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ఎంపిక చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి ఆగ్రోస్ నేరుగా కంపెనీల నుంచి ఎరువులు తీసుకొచ్చి రైతులకు తమ కేంద్రాల ద్వారా విక్రయించనుంది.

నిరుద్యోగ పట్టభద్రులకు అవకాశం: రెండు దశాబ్దాల కిందట ఆగ్రోస్ ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక యంత్రాలను పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసింది. ఇందు కోసం అప్పట్లో జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉండేవి. నిధుల కొరతతో అవి ప్రాభవం కోల్పోయి చివరికి మూతపడ్డాయి. సిబ్బందిని రాష్ట్ర స్థాయి కార్యాలయంలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ప్రస్తుతం అంపశయ్యపై ఉన్న ఈ సంస్థ ప్రాణాన్ని నిలబెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఇప్పటికే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు ఏర్పాటుకు అవకాశం కల్పించారు. నిరుద్యోగ పట్టభద్రులు వీటిని నిర్వహించేందుకు అనుమతించింది. ప్రస్తుతం వీటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నాయి.

రైతులకు మేలు: మార్క్‌ఫెడ్ ద్వారానే కాకుండా ఆగ్రోస్‌తో ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం వల్ల రైతులకు మేలు జరగనుంది. తద్వారా ప్రతి గ్రామానికి సకాలంలో ఎరువులు అందనున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా ఆగ్రోస్ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. పెద్ద ఎత్తున ఎరువుల నిల్వల కోసం గోదాములు సమకూర్చుకోవాలి. ఆగ్రోస్ ద్వారా ఎరువుల సరఫరా చేపడితే రైతులకు దూరాభారం తగ్గుతుంది. దీనివల్ల ఖర్చు సైతం ఆదా అవుతుంది. సరఫరా కేంద్రాల సంఖ్య పెరగటం వల్ల వానాకాలం యాసంగి సీజన్లలో అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందుతాయని జోగులాంబ జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ అంటున్నారు.



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం

ఉమ్మడి జిల్లాలో ఇలా..

సహకార సంఘాలు 82

సాగు విస్తీర్ణం 18.50 లక్షల ఎకరాలు

ఎరువుల వినియోగం 3.94 లక్షల మెట్రిక్ టన్నులు

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

జడ్చర్ల, హన్వాడ, న్యూస్‌టుడే: హన్వాడ మండలంలోని అమ్మాపూర్ గ్రామ కార్యదర్శి శివప్రకాశ్‌ను సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు హన్వాడ ఎంపీడీవో యశోద తెలిపారు. గతంలో జడ్చర్ల మండలంలోని పోలేపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా శివప్రకాశ్ విధులు నిర్వహించిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. బదిలీపై వెళ్లిన గతంలో పని చేసిన పోలేపల్లి పంచాయతీలోని దస్త్రాలు ఇక్కడి కార్యదర్శికి అప్పగించలేదని ఈయన స్థానంలో వచ్చిన కార్యదర్శి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. దీంతో విచారణలో రూ.1.73 కోట్లు నిధులు దుర్వినియోగమయ్యాయని అధికారులు నిర్ధారించి సస్పెన్షన్ వేటు వేసినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు తమకు ఉత్తర్వులు అందాయన్నారు. ఆయనతో పాటు గతంలో పంచాయతీ సర్పంచిగా పని చేసిన మహిళ సర్పంచికి తాకీదులు అందజేసినట్లు సమాచారం.

ఆర్టీసీకి దసరా బొనాంజా

16 రోజుల్లో రూ.39.22 కోట్ల ఆదాయం



ఆర్టీసీ ఆదాయ వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

మహబూబ్‌నగర్ (గ్రామీణం), న్యూస్‌టుడే: ఆర్టీసీకి దసరా పండగ సందర్భంగా ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం వి.శ్రీదేవి వెల్లడించారు. శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 16 రోజుల పాటు ఆర్టీసీకి వివిధ డిపోల వారిగా ప్రయాణికుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వివరించారు. అక్టోబర్ 1 నుంచి 16 వరకు ఉమ్మడి జిల్లా (రీజియన్) వ్యాప్తంగా 740 బస్సులను వివిధ రూట్లలో 52.72 లక్షల కిలోమీటర్లు నడిపి 69.83 లక్షల మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఆర్టీసీ సంస్థకు రూ.39.22 కోట్ల రాబడి వచ్చిందని ఆర్ఎం తెలిపారు. ఇందులో రూ.4.73 కోట్లు టోల్‌ప్లాజా, సెస్, ఇతర వస్తువుల రవాణా ద్వారా, మరో రూ.34.49 కోట్లు ప్రయాణికుల ద్వారా సమకూరిందని వివరించారు. ఈ ఆదాయం ఆర్టీసీ రీజియన్ లోనే సరికొత్త రికార్డు అన్నారు. 14వ తేదీ ఒక్క రోజే 138 శాతం ఆక్యుపెన్సీతో రీజియన్‌లో ఆర్టీసీకి రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చిందని, ఇది కూడా ఆర్టీసీ చరిత్రలో ఆల్‌టైం రికార్డు అన్నారు. పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయిలోనూ మహబూబ్‌నగర్ రీజియన్ 110 శాతం ఆక్యుపెన్సీ సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఆర్ఎం తెలిపారు.

వివిధ డిపోల వారిగా వచ్చిన ఆదాయం ఇలా

డిపో పేరు	కి.మీలు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
అచ్చంపేట	4.92	315.88
గద్వాల	6.26	415.04
కల్వకుర్తి	6.16	388.36
కొల్లాపూర్	4.21	265.27
కోస్గి	0.73	42.44
మహబూబ్‌నగర్	8.00	519.55
నాగర్‌కర్నూల్	5.06	353.98
నారాయణపేట	5.54	347.10
షాద్‌నగర్	4.83	316.55
వనపర్తి	7.01	485.28
మొత్తం	52.72	3449.45

అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక



అండర్-23 ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైన క్రికెట్ జట్లతో ఎంపీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ (గ్రామీణం), న్యూస్‌టుడే: ఈనెల 21వ తేదీ నుంచి జరిగే ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ పోటీలకు జిల్లా క్రికెట్ సంఘం శుక్రవారం ఆరు జట్లను ఎంపిక చేసింది. 28వ తేదీ వరకు ఈ ఆరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభా చాటిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రంజీ జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు సురేష్, అశోక్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

వేడుక మాటున వేదన





ఆనందానికి ఎవరు కాదంటారు? కానీ ఎంత మాత్రానికి.. మన సరదా ఎదుటివారి ఆరోగ్యంతో ఆడుకోవడానికి కాదు కదా! ఉమ్మడి జిల్లాలో కొంతమంది కుర్రకారు చేస్తున్నదేమిటి? ఉత్సవం, ఊరేగింపు, పెళ్లి.. కార్యక్రమం ఏదైనా.. డీజే మోత మోగిస్తున్నారు.. వృద్ధులు, పిల్లలు, వ్యాధిపీడితులు తల్లడిల్లిపోతున్నారు.

న్యూస్‌టుడే- కోస్గి, పాతబస్టాండ్(నారాయణపేట)

డీజే శబ్దాలు మరణ శాసనాలుగా మారుతున్నాయి. అతి భయంకర ధ్వనులు చెవులను దెబ్బతీస్తున్నాయి. పలువురు యువకులు వాటి ముందు ఎక్కువ సమయం నృత్యాలు చేయడంతో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా డీజేల పట్ల ఆకర్షితులవుతున్నారు. శ్రుతిమించిన ధ్వనులతో ఇబ్బందుల పాలౌతున్నారు.



నారాయణపేటలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేస్తున్న యువకులు

మీకు తెలుసా..?

● మహారాష్ట్రలోని గాంధీ చౌక్ వద్ద జరిగిన ఓ ఉత్సవంలో ఎక్కువ సంఖ్యలో డీజేలను ఏర్పాటు చేశారు. వాటి శబ్ద ప్రభావంతో 250 మంది చెవిపోటుకు లోనయ్యారు. వీరిలో చాలా మందికి చెవుడు వచ్చింది.

● వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్టనందిమల్ల గ్రామంలో 28 ఏళ్ల యువకుడు దసరా ఉత్సవాల శోభాయాత్రలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేశాడు. ఇంటికి వచ్చి గుండెపోటుకు గురై మృతి చెందాడు.

● **ధరూర్:** రేవులపల్లిలో ఇటీవల డీజే శబ్దాల మధ్య బతుకమ్మలను ఊరేగిస్తుండగా సౌండ్ తగ్గించాలని ఓ వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనితో ఊరేగింపు నిర్వాహకులు గొడవపడ్డారు. వారించడానికి వచ్చిన ఆర్మీ జవాన్‌ను కత్తితో పొడిచారు.

మనం ఏం చేయాలి?



● చిన్న శబ్దంతో డీజేలు వాడుకుంటే ఇబ్బంది ఉండదన్న విషయాన్ని యువతకు అవగాహన కల్పించాలి.

● చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన సరదా కోసం ఎదుటివారి జీవన హక్కును దెబ్బతీసినట్లేనని గుర్తించాలి. అర్ధరాత్రి మోతమోగిస్తే ఎక్కువమందికి నిద్రాభంగం కలుగుతుంది.

● ఉమ్మడి జిల్లాలో పోలీసులు డీజే శబ్దాలపై ప్రకటనలు చేస్తున్నా, వాస్తవానికి పట్టించుకోలేదు. కొన్ని చోట్లయితే ఎవరైతే ఫిర్యాదు చేస్తారో వారిపేరును నిర్వాహకులకు చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

చెవులు చిల్లులు

బ్లూటూత్, రిమోట్ వంటి పరికరాలతో డీజేలను నియంత్రించే పద్ధతి రావడంతో శబ్ద కాలుష్యంతోపాటు రేడియేషన్ ప్రభావం ఉంటోంది. మానసిక సమస్యలు, వ్యాకులత కూడా కలుగుతున్నాయి.

శబ్ద తీవ్రతను డెసిబుల్స్‌లో కొలుస్తారు. డెబ్బై డెసిబుల్స్ తీవ్రత ఉన్న శబ్దాలను చెవులు తట్టుకోగలుగుతాయి. ఆపై పెరిగితే ప్రమాదం తప్పదు. 80 నుంచి 100 డెసిబుల్స్ మధ్య చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. వంద నుంచి 120 డెసిబుల్స్ మధ్య రక్తపోటు పెరిగి గుండె లయ తప్పి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. మనుషులే కాదు పశుపక్ష్యాదులపై ధ్వని ప్రభావం చూపుతుంది.

మన జిల్లాలో వినాయక, బతుకమ్మ, దుర్గామాత ఉత్సవాల్లో సౌండ్‌బాక్స్‌లను పెద్దఎత్తున వినియోగిస్తున్నారు. పల్లెల్లోనూ కొంతమంది డీజేలను కొనుగోలు చేసి అద్దెలకు ఇస్తున్నారు. ప్రాంతం బట్టి, ఉపకరణం స్థాయిని అనుసరించి రూ. 20 నుంచి రూ. 80 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

నిబంధన అమల్లో ఉంది



హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో డీజేలపై నిషేధం ఇప్పటికే అమల్లో ఉంది. పోలీసులు ఎంతచెప్పినా పౌరసమాజం, ప్రజాసంఘాలు కలిగించుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదు. డీజేల నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి శబ్దకాలుష్యం వల్ల అనర్థాలపై అవగాహన కల్పిస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

- నల్లపు లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

చెవుడు వచ్చే ప్రమాదం



ఎక్కువ శబ్దం, ఎక్కువ సేపు వింటే తరంగాలు చెవుల్లో మోత మోగించడంతోపాటు కర్ణభేరి దెబ్బతింటుంది. వినికిడి సమస్యలు తలెత్తుతాయి. మానసిక ఒత్తిడి, వ్యాకులత పెరుగుతుంది. ఇది మానసిక సమస్యలకు దారితీస్తుంది. చెవుడు వంటి సమస్యలతో పాటు, గుండె పోటుకు ఆస్కారం ఉంటుంది. హృదయ సమస్యలు ఉన్నవారు ఎక్కువ శబ్దాలను వినలేరు. వారిని దృష్టిలో ఉంచుకోవాలి. మెదడు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీలైనంత వరకు తక్కువ శబ్దాలతో, ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు చేస్తే మంచిది.

- డా.శ్రీనివాస్, ఈఎన్‌టీ వైద్యుడు.

292 సెక్షన్ బీఎన్ఎస్ కింద శిక్షార్హులు



పరిమితికి మించిన శబ్దకాలుష్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సెక్షన్ 292 బీఎన్ఎస్ కింద శిక్షార్హులవుతారు. వాణిజ్య ప్రాంతాలు, జనసంచారం ఉండే నివేశాల్లో ఉదయం, రాత్రి వేళల్లో నిబంధనలకు లోబడి శబ్దం ఉండాలి. పరిమితికి మించి శబ్దం పెంచితే రూ.200 నుంచి రూ.2వేల వరకు కోర్టు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రజాజీవనానికి భంగం కల్గిస్తే మరికొన్ని తీవ్ర శిక్షలు, సెక్షన్లు వర్తిస్తాయి.

- కె.రాజశేఖర్, న్యాయవాది నారాయణపేట

చెల్లియో చెల్లక

బాబూ! ఈ పది రూపాయల బిళ్ల తీసుకుని చెరుకు రసం ఇవ్వు.
కుదరదమ్మా.. అది చెల్లదు. నోటు ఉంటే ఇవ్వు...
అదేంటి బాబూ
ఎల్లి గవర్నమెంట్‌ను అడుగు...
- ఇలాంటి సన్నివేశాలు ఉమ్మడి పాలమూరులో చాలాచోట్లు చూస్తూనే ఉన్నాం.
పది రూపాయల నాణేలు ఎంచక్కా వాడుకోవచ్చు. ఎవరైనా అభ్యంతరం పెడితే ఫిర్యాదు చేసే వీలుంది.



న్యూస్‌టుడే- ఊట్కూరు, పాలమూరు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పదిరూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ● ప్రయాణికులు ఇచ్చే రూ. 10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలను జారీ చేశారు. ● మక్తల్ పట్టణంలోని కొన్ని పెట్రోలు బంకుల్లో కూడా రూ. 10, రూ.20 నాణేలను తీసుకోవటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. అవగాహన రాహిత్యం వల్ల కొంత మంది ప్రజలు కూడా తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.

అసలేం జరిగింది

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్దనోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయాల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలామంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులు లేపారు.

బ్యాంకుల్లో రూ.16 కోట్ల నాణేలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ. 16 కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నాయి. పలు ప్రైవేటు, అనుబంధ సంస్థల బ్యాంకులలో మరో రూ. 10 కోట్ల నాణేలు ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎస్‌బీఐ బ్యాంకుల్లో రూ.2.5 కోట్ల రూ.10 నాణెలు, యూనియన్ బ్యాంక్‌లో రూ. 2కోట్లు నాణేలు ఉన్నట్లు ఆ వర్గాల సమాచారం.

అవగాహన విస్తృతం చేయాలి



మా దుకాణానికి సరకుల కోసం వచ్చే కొంత మందికి రూ. 10 నాణెం ఇస్తే తీసుకోవటం లేదు. ఎంత చెప్పినా ససేమిరా అంటున్నారు. కొంత మంది తీసుకెళ్లి, ఎవ్వరూ తమవద్ద తీసుకోకపోతే తిరిగి ఇస్తున్నారు. ప్రజల్లో అపోహలు తొలగిపోవాలంటే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు పెడుతున్నారు. అందులో ఈ విషయం చెప్పాలి. షీటీంలు, ఇతరశాఖల అవగాహన సదస్సుల్లో ఇదో అంశంగా చేస్తే బాగుంటుంది.

- ఎస్.మధుకర్, కిరాణా దుకాణదారుడు, ఊట్కూరు.



మహబూబ్‌నగర్‌లో దుకాణదారులకు రూ.10 నాణెంపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

నిరాకరిస్తే ఫిర్యాదు చేయండి



దుకాణదారులైనా, వ్యాపార సంస్థలైనా , వ్యక్తులైనా రూ.10, రూ.20 నాణేలను తీసుకునేందుకు నిరాకరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు దగ్గరలోని పోలీసు స్టేషన్‌లోనో, లేదా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు. అందరం కలిసి అసత్య ప్రచారాలను ఆపుదాం.

- కాల్వ భాస్కర్, లీడ్ బ్యాంకు మేనేజర్, మహబూబ్‌నగర్.

'పాలమూరు'పై సీఎంకు చిత్తశుద్ధి ఏదీ?: నాగం



నాగర్‌కర్నూల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి నార్లపూర్, వట్టెం, కర్వెన జలాశయాలను నీటితో నింపాలని మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి దాదాపు 9 నెలలు దాటినా కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన మూడున్నర కిలో మీటర్ల సొరంగం పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రస్తుత వర్షాకాలం ముగిసే వరకు పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. లేని పక్షంలో డిసెంబర్ 9న కూడికిళ్ల వద్ద నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. అకాల వర్షాలతో పత్తి సాగు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పంట నష్టపరిహార నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించి పత్తి కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ, హైడ్రా పరిపాలన బంద్ చేసి ప్రజా పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని కాల్వల ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వెళ్లేలా వెడల్పు చేయాలన్నారు. జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు డా. నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, బాలగౌడ్, ఐతోలు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి

మల్దకల్, న్యూస్‌టుడే: పత్తి పొలానికి పురుగు మందు పిచికారీ చేసిన రైతు తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన మల్దకల్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మంగళి ఆంజనేయులు(46) గురువారం తన పత్తిపొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేశాడు. దీంతో రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్సకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. ఆంజనేయులుకు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వివరించారు.

బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం



శైలేష్

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నచర్ల, రాయిపాకుల దారిలో శుక్రవారం ఉదయం బస్సు, బైకు ఢీకొన్న ఘటనలో వెన్నచర్లకు చెందిన సంపంగి హన్మంతు చిన్నకుమారుడు సంపంగి శైలేష్ (18) మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. వెన్నచర్ల నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్న శైలేష్ బండరాయిపాకుల సమీపంలో బస్సును అధిగమించబోయి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన యువకుడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

పిడుగు పాటుకు కూలీ...



సంగమ్మ

మరికల్ కూడలి : పిడుగు పడి ఓ వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మరికల్ మండలం కన్మనూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల కథనం ప్రకారం... శెర్నపల్లి గ్రామానికి చెందిన రైతు కన్మనూర్ శివారులో కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కర్ణాటక రాష్ట్రంలోని గురిమిట్కల్ తాలుకా పరిధిలోని అన్పూర్ గ్రామానికి చెందిన మహిళలను పత్తి తీసేందుకు శుక్రవారం తీసుకొచ్చాడు. మధ్యాహ్నం వర్షం పడడంతో వారు ఓ చెట్టు కిందకు చేరారు. ఆ సమయంలో పిడుగు పడగా బోయ సంగమ్మ(45) అనే మహిళ అక్కడిక్కడే మృతి చెందారు. మల్లమ్మ, అల్లమ్మ అనే మహిళలకు గాయాలై అస్వస్థతకు గురయ్యారు. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే కూలీలను తీసుకొచ్చిన వాహనంలోనే మృతదేహం, గాయపడిన వారిని తరలించారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజుతో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ.. కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారని వివరించారు.

పీయూలో సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ పోటీల కోసం ఎంపికలను నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీయూలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను పురుషుల విభాగంలో నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీరాములు (కొల్లాపూర్), జగదీశ్ (నారాయణపేట), బడేసాబ్ (మహబూబ్‌నగర్), శివకృష్ణ (నారాయణపేట), రాకేశ్ (మహబూబ్‌నగర్) తదితర క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పీడీలు సత్య భాస్కర్, వెంకట్‌రెడ్డి, శారద, నరేశ్, మన్యం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం పెద్దినేనికాలువ గ్రామం బెస్తపల్లిలో నివాసం ఉన్న వివాహిత లక్ష్మి(25) శుక్రవారం ఇంటిలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో సమాచారం అందుకున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి అసిఫా సుల్తానా ఆసుపత్రికి వచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాసులు విచారించి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన గోవిందు. లక్ష్మిల దంపతులు రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చారు. సుండుపల్లి మండల పరిధిలోని రాళ్లుకొట్టే పనులు చేస్తూ బెస్తపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. వీరికి మూడేళ్లు, పదినెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఘటన గురించి తెలుసుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, సుండుపల్లి ఎస్సై శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి విచారించారు. లక్ష్మిపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీతకే సీఎం కప్



సీఎం కప్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ మంచి వేదిక అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ టార్చ్ ర్యాలీకి కలెక్టర్ స్వాగతం పలికారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత క్రీడా సాధనతో శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
మహబూబ్‌నగర్ : 9948145978 | జడ్చర్ల : 8008573899
దేవరకద్ర : 9000031648 | భూత్పూర్ : 8008563143

సమస్య : దేవరకద్ర ఆర్వోబీపై దీపాలు వెలగడంలేదు. - రాజు
సమాధానం : మరమ్మతులు చేస్తాం.
- శ్రీకాంత్, విద్యుత్తు శాఖ ఏఈ, దేవరకద్ర
- న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు




వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న చైతన్య పాఠశాల విద్యార్థులు

పాలమూరు, న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చైతన్య, భాష్యం ఉన్నత పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి, పలు అంశాలపై వారికి నిర్వహించిన వ్యాస రచన పోటీలు నిర్వహించారు. రెండు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు. చైతన్య పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు పోటీ పరీక్షలు రాశారు. అందులో మంచి ప్రతిభ చూపిన రోహిణి దత్తకు ప్రథమ, తరుణికి ద్వితీయ, మనశ్రీకి తృతీయ బహుమతులు లభించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్, ఉపాధ్యాయులు తబస్సుమ్ నౌషీన్, మహేశ్, దీప్తి, మేఘా, మల్లేశ్, చంద్రు, శ్రీరాం, వీరోనికా తదితరులు పాల్గొన్నారు.

● భాష్యం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పదోతరగతి విద్యార్థులు పాల్గొన్ని పరీక్ష రాశారు. అందులో సౌమ్యకు ప్రథమ, అఫ్రీన్ ఫిర్దోస్‌కు ద్వితీయ, అఫ్షా జబీన్‌కు తృతీయ బహుమతి లభించింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాధవి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్లలోని స్మార్ట్‌వండర్ పాఠశాల, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాలంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశాలపై పోటీలు జరిగాయి. స్మార్ట్‌వండర్ స్కూల్‌లో 14 మంది విద్యార్థులు పాల్గొనగా తొమ్మిదో తరగతికి చెందిన సంజనారెడ్డి ప్రథమ, రిధిక (8వ తరగతి) ద్వితీయ, మేఘశ్రీ(10వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. పాఠశాల కరెస్పాండెంట్, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, డైరెక్టర్ గోవర్ధన్ బహుమతులు అందచేశారు. బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో 24 మంది పాల్గొనగా నవ్య (10వ తరగతి) ప్రథమ, విషాలాక్షి ద్వితీయ, కృత్యసహస్ర తృతీయ బహుమతులు సాధించారు. ప్రిన్సిపల్ కె.వి.శ్రీనివాస్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది అధృత, చారి, సునంద, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







భాష్యం పాఠశాలలో బహుమతులు పొందిన విద్యార్థినులు.. జడ్చర్ల: విజేతలకు బహుమతులు అందచేస్తున్న స్మార్ట్ వండర్ స్కూల్ కరెస్పాండెంట్ విష్ణువర్ధన్, డైరెక్టర్ గోవర్ధన్.. జడ్చర్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న బ్రిలియంట్ స్కూల్ ప్రిన్సిపల్ కె.వి.శ్రీనివాస్

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు తొలగించాలని ఆదేశం

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల పట్టణంలోని నల్లకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను యజమానులు తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, తహసీల్దారుకు ఉత్తర్వులు జారీ చేసింది. యజమానులు స్పందించపోతే పుర కమిషనర్ తొలగించాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : ఎన్‌సీసీ విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని ప్రిన్సిపల్ సుకన్య అన్నారు. శుక్రవారం జడ్చర్లలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు హిందీ భాషపై శిక్షణ శిబిరం ప్రారంభించారు. హిందీ విభాగాధిపతి, శిక్షకుడు డా.నరసింహరావు, కల్యాణి అవగాహన కల్పించారు. నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్‌సీసీ అధికారి సుబేదార్ నాయక్, అమృతపాల్ సింగ్, డా.రాజేశ్వరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

దేవరకద్ర గ్రామీణం : నాగన్నపల్లి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. మండలంలోని చిన్నరాజమూర్ నుంచి కౌకుంట్లసాగర్ గ్రామానికి 2 కి.మీ బీటీ రహదారి కోసం రూ.2 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మైబు, కుమార్, వెంకటరెడ్డి, మాధవరెడ్డి, గోపాల్, నర్సిరెడ్డి, ఆంజనేయులు, వెంకయ్య పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు



అవార్డు అందుకున్న ప్రిన్సిపల్ ఎబినేజర్

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం పాఠశాల ప్రిన్సిపల్ డా.బి.ఎబినేజర్‌కు జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు వచ్చినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. రెండు రోజులుగా మధురైలో జరుగుతున్న సీబీఎస్ఈ జాతీయ ఉపాధ్యాయ సమావేశంలో ఆయన హాజరయ్యారు. ఆయన ది ఆర్ట్ అటాక్, ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ద్వారా మానసిక శ్రేయస్సు కోసం సమగ్ర దృక్పథం అనే అంశంపై పరిశోధన పత్రం అందజేసి వివరించారు. ఇందుకు గాను అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

21న మీనాంబరంలో అగ్నిగుండ మహోత్సవం

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్ల మండలంలోని కుర్వగడ్డపల్లి పంచాయతీలోని మీనాంబరం పరుసవేదీశ్వరస్వామి ఆలయంలో అగ్నిగుండ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్ శుక్రవారం తెలిపారు. 20న రుద్రాభిషేకం, రుద్ర హోమం, అగ్నిగుండ స్థల పూజ, గణపతి పూజ, వీరభద్రస్వామికి నందికోల సేవ, 21న అగ్నిగుండ మహోత్సవం, శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందన్నారు.

క్షయవ్యాధి నివారణకు చర్యలు

భూత్పూర్, న్యూస్‌టుడే: క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డా.మల్లికార్జున్ అన్నారు. మండలంలోని అన్నాసాగర్‌లో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. నిరంతరం దగ్గు, గొంతు నొప్పి లక్షణాలు కలిగిన వాళ్లు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామంలో 150 మందికి పరీక్షలు నిర్వహించగా, 25మంది అనుమానితులకు కళ్లే పరీక్షలు చేసినట్లు చెప్పారు. వైద్యులు డా.అబ్దుల్‌రబ్, డా.రాధిక, ఎస్‌టీఎస్ రాజు, బాలరాజు ఏఎన్ఎం జానకి పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ రాష్ట్ర ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించడాన్ని టీఎన్జీవోల సంఘం జిల్లా కమిటీ స్వాగతిస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే 22 నుంచి జేఏసీ ప్రకటించే ఉద్యమ కార్యాచరణకు సైతం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు

ఈడబ్ల్యూఎస్ కోటా రద్దు చేయాలి

భూత్పూర్, న్యూస్‌టుడే : విద్యా, ఉద్యోగ రంగాల్లో అగ్రవర్ణాలకు ఇస్తున్న ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దు చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. భూత్పూర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రవర్ణాల్లో పేదలు 2 శాతమేనని, వారికి 10 శాతం కోటా ఇవ్వడం సరికాదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, నాగన్న, గోపాల్, శ్రీనివాస్, నరేందర్, రవి పాల్గొన్నారు.

కార్మికులను వేధించడం సరికాదు: ఏఐటీయూసీ

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులపై దొంగతనం అనుమానంతో పోలీసులు వేధించడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు నర్సింహను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత కార్మికులపై కక్ష్యపూరితంగా దొంగతనం ఆరోపణలతో నెల రోజుల నుంచి పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, నాయకులు మోహన్‌నాయక్, సంతోష్, శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌కు ధర్మ ప్రచార సైకిల్ యాత్రికులు



బాలానగర్, న్యూస్‌టుడే : ధర్మప్రచారమే లక్ష్యంగా బెంగుళూర్‌లోని వైట్ ఫీల్డ్స్‌కు చెందిన 13 మంది యాత్రికులు కర్ణాటక నుంచి అయోధ్య రామ మందిరం వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. శుక్రవారం ఈ యాత్ర మండల కేంద్రానికి చేరుకుంది. బృందం నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోజుకు 120 కి.మీ ప్రయాణం చేస్తుంటామని, మరో 16 రోజుల్లో అయోధ్యకు చేరుకుంటామని తెలిపారు.

రెండు పడక గదుల ఇళ్ల వద్ద వసతులు కల్పించండి

భూత్పూర్, న్యూస్‌టుడే : పురపాలిక పరిధిలోని సిద్ధాయిపల్లి రెండు పడక గదుల ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలపై లబ్ధిదారుల నుంచి వినతులు అందినట్లు ఎస్ఆర్పీ బద్రూనాయక్ తెలిపారు. మూడు రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు వివరించారు. 288 ఇళ్లకు 62 ఇళ్లు తాళం వేసి ఉన్నట్లు చెప్పారు. 252 మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు కాగా మిగతావి చూపడంలేదన్నారు. మౌలిక వసతులు లేకపోవడంతో ఇళ్లకు నివసించేందుకు ఆసక్తి చూపడం లేదని చెప్పారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్ తెలిపారు. పుర కమిషనర్ సురేందర్‌రెడ్డి, డీటీ గీతా, ఏఈ స్వామి, ఆర్పీలు వెంకటేష్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను అభివృద్ధి చేస్తాం: మంత్రి



పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజలకు సేవలు చేయడానికి అనుకూల పరిస్థితి కల్పించాలని, శక్తి ఇవ్వాలని జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామిని కోరినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయంతో ప్రణాళిక సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రజల సహకారంతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి జోగులాంబ అమ్మవారి సన్నిధిలో ఒక సత్రాన్ని నిర్మించేందుకు స్థలం సేకరించామని, త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అమ్మ వారి సన్నిధి నుంచి హారతి అనంతరం భక్తులు సులభంగా తిరిగి వెళ్లేందుకు అలంపూర్ చౌరస్తా వరకు ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు పూర్వం మంత్రి దంపతులు కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. మంత్రి దంపతులకు ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఆర్డీవో రామచందర్ తదితరులున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ తల్లికి వైద్య పరీక్షలు

పాలమూరు, న్యూస్‌టుడే: కలెక్టర్ విజయేందిర బోయి తల్లి హైమావతి (86)కి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎక్స్‌రే, ఇతర స్కానింగ్ సేవలతో పాటు, ఈఎన్‌టీ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమెకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్‌తో పాటు, ఆర్థో, రేడియాలజీ విభాగ ఆచార్యులు వైద్య సేవలందించారు. అనంతరం రిపోర్టుల ఆధారంగా వైద్యులు ఆమెకు ఆరోగ్య సూచనలను అందించారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగ ఆచార్యులు డా. హన్మత్‌ప్రసాద్, ఆర్థో విభాగాధిపతి రవీందర్ గౌడ్, సహాయ ఆచార్యులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో బహుమతులు సాధించాలి

పాలమూరు, న్యూస్‌టుడే: కళా రంగాల్లో తమ సత్తాచాటి జాతీయ స్థాయిలో బహుమతులు సాధించాలని డీఈవో రవీందర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎం సమావేశ మందిరంలో కళా ఉత్సవంలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఎంపికలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన 269 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అందులో మంచి ప్రదర్శన చేసిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో బాలుయాదవ్, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, న్యాయ నిర్ణేతలుగా గుమ్మడాల చక్రవర్తి, చలపతి, శంకర్, శ్రీనివాస్, గీత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

దేవరకద్ర గ్రామీణం : ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకద్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకులు వర్గీకరణపై మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జంబులయ్య, శ్రీనివాస్, యాదగిరి, దొబ్బలి ఆంజనేయులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణం శ్రీనివాసకాలనీలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వివిధ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బ్రహ్మాండం గురునాథశర్మ వెల్లడించారు. మొదటిరోజు పూజల్లో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచం, అంకురార్పణ, జలాధివాసం, అగ్నిప్రతిష్ఠ, ఆదివాస హోమం నిర్వహించారు. ఆదివారం నాగేంద్రస్వామి, జంటనాగులు, నవగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని, భక్తులు పాల్గొనాలని గురునాథ్‌శర్మ కోరారు.

విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలి

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.శారదాబాయి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు చెన్నవీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం బాదేపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర, బాలికల విభాగం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో దేవరకద్ర మండల జట్టు ప్రథమ స్థానం, బాలానగర్ మండల జట్టు ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో జడ్చర్ల మండల జట్టు ప్రథమ, కోయిల్‌కొండ మండల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు నిరంజన్, జగన్‌మోహన్‌గౌడ్, కృష్ణయ్య, జీహెచ్ఎంలు యుగేందర్, అనంతప్ప, శ్రీనివాసులు, సరస్వతి, ఇన్‌ఛార్జి హెచ్ఎం ఇబ్రహీం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన



రెవెన్యూ అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి సమీపంలోని మౌలాలిగుట్ట పరిసరాల్లో కొత్తగా క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పురపాలక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాంనాయక్, అదనపు తహసీల్దార్ దేవేందర్, మండల సర్వేయర్ రాఘవేంద్రలతో కలిసి శుక్రవారం మౌలాలిగుట్ట పరిసరాల్లోని సర్వే నెంబర్ 380లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం మోకమీద 13 ఎకరాల వరకు ప్రభుత్వ స్థలం ఉన్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు రికార్డుల ఆధారంగా చూపించారు. స్టేడియం నిర్మాణానికి కనీసం 20 ఎకరాల విస్తీర్ణంలో స్థలం అవసరం ఉంటుందని, రికార్డుల ఆధారంగా మౌలాలిగుట్ట పరిసరాల్లోనే మిగతా స్థలం గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. స్టేడియానికి క్రీడాకారులు, పౌరులు వచ్చిపోయేందుకు అనువుగా రెండు రహదారులు ఉండాలి. రహదారుల నిర్మాణం కోసం కూడా ఎమ్మెల్యే అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సుధాకర్‌రెడ్డి, పాపారాయుడు తదితరులున్నారు.

తక్కువ ధరలకే ప్లాట్లు విక్రయించాలి



కార్యాలయం ముందు ఎమ్మెల్యే

అడ్డాకుల, న్యూస్‌టుడే : సామాన్యులకు తక్కువ ధరకే ప్లాట్లను అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో మూరుతి ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా సకల వసతులతో వెంచర్లను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. వెంచర్లు ఉన్న ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నిర్వాహకులు యాదగిరి, నాయకులు శెట్టిశేఖర్, నాగిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీహరి, బాలనర్సింహులు, తిరుపతయ్యయాదవ్, దశరథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధర్నా

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొందరూ మతోన్మాదవాదులు ఆలయాలను కేంద్రంగా చేసుకుని దేవతామూర్తుల మూలవిరాట్‌లను ధ్వంసం చేస్తున్న ఘటనలను నిరసిస్తూ శనివారం మహబూబ్‌నగర్‌లో ధర్నా, నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో దుండగులు పట్టుబడిన పోలీసులు చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. శనివారం ఉదయం 10.30 గంటలకు తెలంగాణ చౌరస్తాలో జరిగే ధర్నాలో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

భూ అక్రమాలపై విచారించాలి



నిరసనలో భాజపా నాయకులు

మిడ్జిల్, న్యూస్‌టుడే : మిడ్జిల్ మండల కేంద్రంలో జరిగిన భూ దందాలో అవినీతికి పాల్పడిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భాజపా నాయకులు రాజేశ్వర్, తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈనాడు దినపత్రికలో వచ్చిన 'ఇదో భూ దందా' కథనం చూపిస్తూ ఆందోళన చేశారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించి బాధితుల పక్షాన నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్, వాసుదేవ్, రమేష్‌గౌడ్, అరవింద్, శేఖర్, అంజి పాల్గొన్నారు.

ఉత్సవాలకు రాజగోపురం ముస్తాబు

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీ కురుమూర్తి స్వామివారి ఉత్సవాలకు రాజగోపురానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. స్వామివారి ఉత్సవాలు ఈ 31 నుంచి ప్రారంభం కానుండటంతో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ రాజగోపురానికి రంగులు వేస్తున్నారు. స్వామివారి ఉత్సవాలకు ఆలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

విధుల్లో తాత్కాలిక ఏఈవోలు

మొదలైన డిజిటల్ సర్వే



ముకర్లాబాద్‌లో డిజిటల్ సర్వేలో పాల్గొన్న ఏఈవో ఫక్రుద్దీన్

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: బెట్టుకు దిగిన వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)లు మెట్టు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుపై డిజిటల్ సర్వే చేపట్టాలని సూచించడంతో తమకు ఇబ్బందులు ఉన్నాయంటూ వారు నిరసనకు దిగారు. దీంతో గత నెల 19 నుంచి ఉమ్మడి జిల్లాలో పంటల సాగుపై డిజిటల్ సర్వే నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. ఈ విషయంలో తమకు సహాయకులు కావాలని, ప్రత్యేక ట్యాప్‌లు, 8జీపీ డాటా ఫోన్లు, ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలని వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రభుత్వం ముందు వివిధ సమస్యలను ఉంచారు. మరో దిక్కు రాష్ట్ర వ్యవసాయ శాఖ సైతం పంటల సాగుపై డిజిటల్ సర్వే నిర్వహించాలని అంతే పట్టుకు దిగింది. చివరకు వ్యవసాయ శాఖలోని కొన్ని సంఘాలు విస్తరణ అధికారులకు మద్దతు ప్రకటించాయి. కానీ ఈ లోపు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు కొంత మంది విస్తరణ అధికారులకు మెమోలు ఇచ్చారు. ఈ విషయంలో వెంటనే వెనక్కి తగ్గక పోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వ్యవసాయ విస్తరణ అధికారుల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు గానూ, కొందరు తాత్కాలిక ఉద్యోగులుగా ఉన్నారు. వారిలో తాత్కాలిక ఉద్యోగులు ప్రభుత్వం హెచ్చరిస్తున్నా ఆదేశాలతో ఇబ్బందులు ఉంటాయని వెనక్కి తగ్గారు. ఈ లోపు కొన్ని సంఘాలతో రాష్ట్ర, జిల్లా అధికారులు గురువారం చర్చలు జరిపారు. ప్రతి రోజు 20 సర్వే నంబర్లను డిజిటల్ సర్వేను నిర్వహించాలని, ఇందుకు తగిన అలవెన్సులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. దీంతో ఇప్పటికే ఆందోళనలో ఉన్న తాత్కాలిక ఉద్యోగులు దాదాపు 80 మంది శుక్రవారం డిజిటల్ సర్వే పనుల్లో లీనమయ్యారు. మరో దిక్కు ప్రభుత్వ ఉద్యోగులైన కొందరు విస్తరణ అధికారులు సైతం తమ పట్టు పై వెనక్కి తగ్గినట్లు తెలిసింది. వారు కూడా ఒకటి రెండు రోజుల్లో సర్వేలో పాల్గొననున్నట్లు కొందరు యూనియన్ నాయకులు 'న్యూస్‌టుడే'తో చెప్పారు.

చేప పిల్లల విడుదల

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన చేప పిల్లలను మండలంలోని 9 పెద్ద చెరువులు, 66 కుంటల్లో శుక్రవారం విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

బాలానగర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని పెద్ద, చిన్న చెరువుల్లో 30 వేల చేప పిల్లలను వదిలినట్లు సింగిల్ విండో డైరెక్టర్ గుడిసెల యాదయ్య తెలిపారు.

పోలీసుల విచారణ

మిడ్జిల్, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై ఈనెల 1న కొందరు వ్యక్తులు అత్యాచారయత్నానికి పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం సీఐ నాగార్జునగౌడ్ ఘటనా స్థలిని పరిశీలించారు. ఎస్సై శివనాగేశ్వర్ నాయుడుతో కలిసి విచారించారు.

క్రైం కార్నర్

బాల్య వివాహం చేసిన ఆరుగురిపై కేసు

జడ్చర్ల, న్యూస్‌టుడే : బాల్య వివాహంపై జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని(16)కి గతేడాది నవంబరులో బండమీదపల్లికి చెందిన ఓ యువకుడితో వివాహమైంది. ఈ విషయంపై తాజాగా ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు అందడంతో జడ్చర్ల సూపర్‌వైజర్ సుగుణ వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 6 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ పై కేసు నమోదు..

గండీడ్, న్యూస్‌టుడే: గోవింద్‌పల్లి తండాకు చెందిన సక్రియానాయక్ ఈ నెల 16న వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పెట్టి వెళ్లాడు. వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: జూలపల్లి గ్రామానికి చెందిన జోగు నర్సయ్య(72) సెప్టెంబరు 10న కుమార్తె వెంకటమ్మ దగ్గరికి ఈరారం వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. చుట్టూ పక్కల బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

పొలంలో హద్దురాళ్లు తొలగించిన ఘటనపై..

గండీడ్, న్యూస్‌టుడే: కొండాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ పొలంలోకి పాలేవాళ్ల బాల్‌రాజ్, శేఖర్, శ్రీనివాసులు, మోహన్‌బాబు అక్రమంగా ప్రవేశించి సిమెంట్ హద్దురాళ్ల తొలగించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

కేసు నమోదు.. మిడ్జిల్, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. కుర్వగడ్డపల్లి గ్రామానికి చెందిన నిందితులు దాడి సమయంలో తప్పించుకున్నారని చెప్పారు.

మరో ఘటనలో... మిడ్జిల్, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దగుండ్లతండా పంచాయతీ మర్లభావి తండాకు చెందిన కుమార్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. ఈనెల 12న శాంతి, రాజుకుమార్, గోపాల్ దాడి చేశారని చెప్పారు.

మహిళపై దాడి కేసు నమోదు.. అడ్డాకుల, న్యూస్‌టుడే : పశువుల కాపరులపై దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు అడ్డాకుల ఏఎస్సై గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. . కందూరు గ్రామానికి చెందిన సొంటమనెమ్మ, కాశన్నల పశువులు కాటవరం తండాకు చెందిన జటావత్ శంకర్ ద్విచక్ర వాహనానికి గురువారం అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. కాపరులపై శంకర్ కర్రతో దాడి చేశాడు. గాయపడిన మనెమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు.

రైతుల కేబుల్ వైర్‌ల చోరీ.. నవాబ్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని లోకిరేవు, లింగంపల్లి, ఊరంచుతండా గ్రామాల్లో వ్యవసాయ బోర్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైర్‌ను చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. నవాబ్‌పేట శివారు నుంచి రాజాపూర్ మండలం కుత్నేపల్లితండా వరకు సుమారు 30 మంది రైతులకు సంబంధించిన వైర్‌ను చోరీ చేసినట్లు చెప్పారు. గతంలోనూ పలుమార్లు ఇలా జరిగిందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.